రన్‌ ఫర్‌ ఎస్‌ఎంఏ పోస్టర్‌ ఆవిష్కరణ

రాయదుర్గం: దేశవ్యాప్తంగా స్పైనల్‌ మస్క్యులర్‌ అట్రోఫీ(ఎస్‌ఎంఏ) ప్రభావిత కుటుంబాలకు మద్దతు అందించే లక్ష్యంతో క్యూర్‌ ఎస్‌ఎంఏ ఇండియా, రన్‌ ఫర్‌ ఎస్‌ఎంఏ–2025 మూడో ఎడిషన్‌ను ఆగస్టు 10వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించనున్నారు. శనివారం గచ్చిబౌలిలోని సైబరాబాద్‌ పోలీసు కమిషనరేట్‌లో ఈ రన్‌ పోస్టర్‌ను కమిషనర్‌ అవినాష్‌ మహంతి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆ వ్యాధి చిన్నారుల కండరశక్తిని, కదలిక సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుందని, శ్వాస సంబంధిత సమస్యల ద్వారా ప్రాణాపాయం తలెత్తే ప్రమాదం ఉందని డాక్టర్లు తెలిపారని గుర్తు చేశారు. క్యూర్‌ ఎస్‌ఎంఏ ఇండియా సహ వ్యవస్థాపకురాలు ట్రస్టీ శ్రీలక్ష్మీ మాట్లాడుతూ రన్‌ ఫర్‌ ఎస్‌ఎంఏ–2025 ఆగస్టులో ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే ఎస్‌ఎంఏ అవగాహన మాసంలో భాగంగా జరుగుతుందన్నారు. రన్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ టీ షర్ట్‌, మెడల్‌, సర్టిఫికెట్‌ ఇవ్వనున్నట్లు చెప్పారు. విద్యార్థులు, కార్పొరేట్‌ ఉద్యోగులు, వైద్య నిపుణులు, ఎస్‌ఎంఏ బాధిత కుటుంబాలు, సాధారణ ప్రజలు పెద్ద ఎత్తున పాలు పంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సైబరాబాద్‌ జాయింట్‌ సీపీ ట్రాఫిక్‌ డాక్టర్‌ గజరావు భూపాల్‌, పలువురు సంస్థ ప్రతినిధులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

గెస్ట్‌ లెక్చరర్‌ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శేరిలింగంపల్లి: భెల్‌ టౌన్‌షిప్‌లోని శేరిలింగంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26వ విద్యా సంవత్సరానికి గాను అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు ఔత్సాహిక అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ ఎ.కవిత తెలిపారు. ఈ నెల 23 తేదీ సాయంత్రం 5 గంటల వరకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పోస్ట్‌ గ్రాడ్యుయేషన్‌లో కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలన్నారు. అదే విధంగా నెట్‌, సెట్‌, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆంగ్లం, తెలుగు, చరిత్ర, రాజనీతి శాస్త్రం, గణితం, కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ అప్లికేషన్స్‌ బోధించేందుకు ఒకరు చొప్పున, కామర్స్‌కు ఇద్దరు అభ్యర్థులు అవసరం ఉన్నట్లు వివరించారు.

ట్రిపుల్‌ఐటీలో ఘనంగా వనమహోత్సవం

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో వన మహోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలిలోని క్యాంపస్‌లో డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ పీజే నారాయణన్‌, ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు సమష్టిగా 1,200 మొక్కలను 'స్థిరమైన గ్రీన్‌ ఇనిషియేటివ్‌' కార్యక్రమంలో భాగంగా నాటారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌ మాట్లాడుతూ... ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌ క్యాంపస్‌ను ఆకుపచ్చ, స్మార్ట్‌, పర్యావరణ బాధ్యతాయుతమైన క్యాంపస్‌గా రూపొందించడమే లక్ష్యంగా మొక్కలను పెంచాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో పలువురు ట్రిపుల్‌ఐటీ ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన 'మోడల్‌ వర్క్‌షాప్‌'

మాదాపూర్‌: మాదాపూర్‌లోని శ్రీ వేంకటేశ్వర ఆర్కిటెక్చర్‌ కళాశాల, చెన్నైలోని ఆర్‌వీఎస్‌ కళాశాల సహకారంతో ఆర్కిటెక్చర్‌ హౌస్‌ మోడల్‌ తయారీపై నిర్వహించిన మూడు రోజుల వర్క్‌షాప్‌ శనివారం ముగిసింది. వర్క్‌షాప్‌లో విద్యార్థులు సృజనాత్మకత, నివాస నమూనాలను రూపొందించారు. ఆవిష్కరణ, జట్టు కృషిని ప్రదర్శించారు. వర్క్‌షాపు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, భానుప్రసాద్‌రావు పాల్గొన్నారు. అనంతరం సర్టిఫికెట్‌లను అందజేశారు. ప్రిన్సిపాల్‌ కామినిసింగ్‌, సురభి విద్యాసంస్థల డైరెక్టర్‌ డాక్టర్‌ అజిత తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ల్యాబ్‌ టెక్నీషియన్‌గా పండరి రెడ్డి

చందానగర్‌: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని 2025 సంవత్సరానికిగాను ఉత్తమ ల్యాబ్‌ టెక్నీషియన్‌ అవార్డు హఫీజ్‌పేట్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్‌ టెక్నీషియన్‌ పండరి రెడ్డికి లభించింది. శనివారం రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో కామినేని ఆస్పత్రి డైరెక్టర్‌ డాక్టర్‌ అంజయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, మెడికల్‌ ఆఫీసర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

మియాపూర్‌: ఇంటి నుంచి వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ పర్వేద్‌ అహ్మద్‌ సమాచారం మేరకు... మియాపూర్‌ న్యూ హాఫీజ్‌పేటలోని ఆదిత్య నగర్‌ కాలనీలోని శ్వేతా ఈస్ట్‌ మిడో అపార్ట్‌లో బువజా గాజ్‌బరే(75) కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. ఈ నెల 16న ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి ఆయన ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేదు. దీంతో మనువడు కిరణ్‌ మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





గుంతల రోడ్లతో దడ

అసంపూర్తిగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు

- మోకాళ్లలోతు తవ్వి వదిలేసిన వైనం
- వర్షపునీరు నిలిచి ప్రమాదాలు
- పట్టించుకోని ఇంజనీరింగ్‌ అధికారులు




గుంతలమయంగా మారిన దీప్తిశ్రీనగర్‌ ప్రధాన రహదారి

మియాపూర్‌: అధికారుల నిర్లక్ష్యం పాదచారులు, వాహనదారుల పాలిట శాపంగా మారింది. వర్షాకాలంలో రోడ్ల నిర్మాణాలు చేపట్టరాదనే నిబంధనను పట్టించుకోనందున పరిస్థితి ప్రమాదకరంగా తయారైంది. వివరాలివీ... చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని దీప్తిశ్రీనగర్‌, శాంతినగర్‌ కాలనీలో ప్రధాన రహదారి మధ్యలో రోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం మోకాళ్లలోతు వరకు రోడ్డును తవ్వి వదిలేశారు. దీప్తిశ్రీనగర్‌–శాంతినగర్‌ వెళ్లే రోడ్డులో మూడుచోట్ల రోడ్డును 15 రోజుల కింద సీసీ రోడ్డు నిర్మాణం కోసం తవ్వి పనులు చేపట్టకుండా వదిలేశారు.

- గుంతలమయమైన ప్రధాన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ 'సాక్షి' దినపత్రికలో 'అధ్వాన రోడ్లు.. ప్రజల అవస్థలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌ మంజుల రఘునాథ్‌ రెడ్డి, ఉన్నతాధికారులు మార్చిలో రోడ్ల నిర్మాణం కోసం దీప్తిశ్రీనగర్‌, శాంతినగర్‌ కాలనీలలో శంకుస్థాపనలు చేశారు. అయితే అధికారులు ఆయా పనులను సరిగా వర్షాకాలంలోనే ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణం కోసం మోకాళ్లలోతు వరకు తవ్వి పనులు చేపట్టకుండా అలాగే వదిలేశారు.
- రోడ్లను తవ్వి వదిలేయడంతో ఆ రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.
- శాంతినగర్‌ నుంచి దీప్తిశ్రీనగర్‌ వెళ్లే రోడ్డులో వర్షాలు పడే సమయంలో వరదనీరు భారీగా ప్రవహిస్తుంది. అదేరోడ్డులో మోకాళ్లలోతు గుంతలు తవ్వి వదిలేయడంతో ప్రజలు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.
- కొత్తవారు వచ్చారంటే ఎక్కడ గుంతలున్నాయో తెలియక ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి వర్షాకాలంలో రోడ్లను తవ్విన కాంట్రాక్టర్లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం పనులను త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.




ఇబ్బంది పడుతున్న వాహనదారులు

త్వరితగతిన పూర్తిచేయాలి



వర్షాకాలంలో రోడ్లు తవ్వకూడదనే నిబంధనలున్నా చందానగర్‌ సర్కిల్‌ ఇంజనీరింగ్‌ అధికారులు సీసీ రోడ్డు నిర్మాణం కోసం సరిగా వర్షకాలంలోనే పాత రోడ్డు తవ్వి వదిలేశారు. రోజుల తరబడి పనులను చేపట్టకుండా అలసత్వం వహిస్తున్నారు. దీంతో భారీ వర్షాలకు వరదనీటిలో రోడ్డుపై ఉన్న గుంతలు కనిపించక పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.
- డి.ఎస్‌.కె.వర్మ, దీప్తిశ్రీనగర్‌

'నిథమ్‌' అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ వెంకటరమణ



మాట్లాడుతున్న డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ వెంకటరమణ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టూరిజమ్‌ అండ్‌ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌ (నిథమ్‌) అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ వెంకటరమణ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి సూచించారు. డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా నిథమ్‌ అధికారులు, ఫ్యాకల్టీ, ఉద్యోగులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చక్కటి, ఆహ్లాదపూరిత వాతావరణం కలిగిన నిథమ్‌ను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు భవిష్యత్తులో అనేక చర్యలు తీసుకుందామన్నారు. విద్యార్థులు, శిక్షణ కోసం వచ్చే వారికి చక్కటి వాతావరణంతోపాటు అధునాతన సౌకర్యాలు కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకుందామన్నారు. నిథమ్‌ క్యాంపస్‌లో వనమహోత్సవం, ప్రపంచ పర్యాటక దినోత్సవం, ఇతర వేడుకలు, వనమహోత్సవ్‌ ఫ్యామిలీ డే, ఫ్యాకల్టీ రీట్రీట్‌, హ్యాకథాన్‌, మారథాన్‌, వాకథాన్‌, వంటి కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

బోనం ఎత్తిన ఆర్‌జేడీ విజయలక్ష్మి

ఆకట్టుకునేలా బోనాల వేడుకలు



రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో బోనం ఎత్తుకున్న విద్యాశాఖ ఆర్‌జేడీ విజయలక్ష్మి

గచ్చిబౌలి/రాయదుర్గం: రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో బోనాల వేడుకలు ఆకట్టుకునేలా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆర్‌జేడీ విజయలక్ష్మి బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నంగా భావించే బోనాలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఇలాంటి వాటిని నేటితరం విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు బోనాల సంబురాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు బోనాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం బాలికలు బోనం ఎత్తుకోగా, కొందరు బాలురు పోతురాజుల వేషధారణతో ఆకట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్‌ భరత్‌కుమార్‌, హెచ్‌ఎం సుందరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

సంస్కృతి హైస్కూల్‌లో...

కొండాపూర్‌ డివిజన్‌ పరిధిలోని పలు కాలనీలతో పాటు సంస్కృతి హైస్కూల్‌లో బోనాలను ఘనంగా నిర్వహించారు, బాలికలు బోనం ఎత్తుకున్నారు. బాలురు పోతురాజుల వేషధారణతో సందడి చేశారు. ఉత్సవాల్లో తమ పిల్లల ప్రతిభను తిలకించిన తల్లిదండ్రులు అబ్బుర పడ్డారు.



సంస్కృతి హైస్కూల్‌లో...

బిట్‌ కాయిన్‌ పేరిట రూ. 30 లక్షలు స్వాహా

నిందితుడి అరెస్టు.. రిమాండ్‌

గచ్చిబౌలి: సైబర్‌ క్రైంలో నిందితుడిగా ఉన్న ఓ వ్యక్తి పోలీసులను పక్కదారి పట్టించి బిట్‌ కాయిన్‌ పేరిట రూ.30 లక్షలు నగదు స్వాహా చేసిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిజామాబాద్‌ సీసీఎస్‌ పోలీసులు ఇటీవల గంగపట్నం వెంకట రమణయ్య అలియాస్‌ రామ్‌ జీవీ, శివ కుమార్‌ అనే వ్యక్తులను సైబర్‌క్రైమ్‌ నిందితులుగా గుర్తించి.. వీరిలో వెంకట రమణయ్యను అరెస్టు చేశారు. శివకుమార్‌ పరారీలో ఉండగా..అతన్ని అరెస్టు చేసేందుకు నిజామాబాద్‌ ఏసీపీ ఒక ప్లాన్‌ రూపొందించి మొదటి నిందితుడు వెంకట రమణయ్య సహాయం తీసుకున్నాడు. ఈమేరకు వెంకటరమణ శుక్రవారం ఫోన్‌ చేసి..బిట్‌కాయిన్‌ మార్పిడి చేద్దాం రమ్మంటూ శివకుమార్‌ను నాటకీయంగా గచ్చిబౌలిలోని ఓ బ్యాంకు దగ్గరకు రప్పించాడు. అయితే ఈ ఘటనలో వెంకటరమణయ్య మోసానికి పాల్పడి శివకుమార్‌ బిట్‌కాయిన్‌ మార్పిడి కోసం తెచ్చిన రూ.30 లక్షలు నగదు తీసుకుని వెళ్లిపోయాడు. ఈ దశలో శివకుమార్‌ను మాత్రం బ్యాంకు వద్ద కాపుకాసిన పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. ఇక వెంకటరమణ మాత్రం నిజామాబాద్‌ ఏసీపీకి కట్టుకథలు చెప్పి..తప్పించుకునే ప్రయత్నం చేయగా...వెంటనే గచ్చిబౌలిలోని సీసీఎస్‌ హెడ్‌ఆఫీస్‌కు సమాచారం ఇచ్చి అతని ఆటకట్టించారు. ఈ ఘటనలో ఓ సినీ నిర్మాత, అతని స్నేహితుడు కల్పించుకున్నట్లు తేలింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంకట రమణయ్య నుంచి రూ.25 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, నల్ల రంగు బ్యాగ్‌ స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.

సొంత భవనాలు నిర్మించుకోలేని ప్రభుత్వం

- బీజేపీ మండల అధ్యక్షుడు వీరేశం

పటాన్‌చెరు టౌన్‌: గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించుకోలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని బీజేపీ పటాన్‌చెరు మండల అధ్యక్షుడు వీరేశం ఆరోపించారు. శనివారం బీజేపీ నాయకులు ఇంద్రేశంలోని గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం హయాంలో గురుకుల పాఠశాలలను పట్టించుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్‌ ప్రభుత్వం కూడా అదే మార్గంలో వెళ్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించి సొంత గురుకుల హాస్టళ్లను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా సెక్రటరీ శేఖర్‌, ఓబీసీ మండల అధ్యక్షుడు రవీందర్‌, పటాన్‌చెరు మండల ఉపాధ్యక్షుడు నాగరాజ్‌ పాల్గొన్నారు.

సందడిగా పాఠశాలలో ఎన్నికల నిర్వహణ

పర్యవేక్షించిన విద్యాశాఖ ఆర్‌జేడీ విజయలక్ష్మి



ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ విజయలక్ష్మి

రాయదుర్గం: రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో ఓపెన్‌ బ్యాలెట్‌ పద్ధతితో విద్యార్థుల ఎన్నికలను శనివారం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణను రాష్ట్ర విద్యాశాఖ ఆర్‌జేడీ విజయలక్ష్మి, పాఠశాల కరస్పాండెంట్‌ భరత్‌కుమార్‌ పర్యవేక్షించారు. పాఠశాలలో హెడ్‌బాయ్‌, హెడ్‌ గర్ల్‌, డిప్యూటీ హెడ్‌బాయ్‌, గర్ల్‌, కల్చరల్‌ కెప్టెన్‌, డిప్యూటీ కెప్టెన్‌, డిసిప్లెన్‌ కెప్టెన్‌, డిప్యూటీ, క్రీడల కెప్టెన్‌, డిప్యూటీ పోస్టులకు ఎన్నికలను నిర్వహించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటు హక్కు వినియోగం, ఎన్నికలలో ఆయా పోస్టులకు సంబంధించి పోటీలలో ఉన్నవారికి విద్యార్థులు ఓటు వేయడంతో ఓట్ల లెక్కింపు ద్వారా గెలిచిన వారిని ప్రకటించారు. గెలిచిన వారిని ఆర్‌జేడీ విజయలక్ష్మి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పాఠశాల స్థాయి నుంచే ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి విధానం అమలు చేయడం హర్షణీయమని ఆమె అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుందరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమిషనర్‌ పర్యటన

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్‌ దశరథ్‌ పర్యటించారు. శనివారం పట్టణ కేంద్రంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం వందరోజుల ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. నివాసాల మధ్య చెత్తచెదారాలు వేయకుండా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని సూచించారు. పరిశుభ్రతలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డంపింగ్‌ యార్డ్‌ను పరిశీలించారు.

కొండాపూర్‌ ఫ్లైఓవర్‌ను పరిశీలించిన డీసీ



కొండాపూర్‌ ఫ్లైఓవర్‌ను పరిశీలించిన డీసీ ప్రశాంతి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలోని వర్షపు నీటితో వాహనదారులు ఇక్కట్లు పడిన రోడ్లను సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ ప్రశాంతి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా రోడ్లపై మ్యాన్‌హోళ్ల పరిస్థితిని ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొండాపూర్‌ ఫ్లైఓవర్‌పై నీరు నిలిచిన ప్రాంతాన్ని, రాయదుర్గం, గచ్చిబౌలి, బొటానికల్‌ గార్డెన్‌ రోడ్లను ఆమె పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎంత వర్షం పడినా సాఫీగా వర్షం నీరు వెళ్లేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు.

బోనాలకు సర్వం సిద్ధం

నేత్రపర్వంగా ఆలయాల ముస్తాబు



రాయదుర్గం శ్యామ్‌లెట్‌ వీధిలోని ఊరపోచమ్మ ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న దృశ్యం

గచ్చిబౌలి/రాయదుర్గం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారి ఆలయాల్లో బోనాల జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి బోనం సమర్పించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. రిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని అమ్మవారి ఆలయాలను ముస్తాబు చేయడంపై ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఆలయాలకు రంగులు అద్దుతూ మామిడి, వేప ఆకులు, విద్యుత్‌ దీపాలతో అలంకారం చేస్తున్నారు. కొండాపూర్‌, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్‌, మియాపూర్‌, హఫీజ్‌పేట్‌, మాదాపూర్‌ డివిజన్ల పరిధిలోని కాలనీలు ,బస్తీలలో వెలసిన అమ్మవారి ఆలయాలన్నీ ముస్తాబు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో బోనాలను ప్రశాంతంగా జరిగేలా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తూ ఆలయ నిర్వాహకులతో మాట్లాడుతూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బోనం సమర్పించేందుకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. తొట్టెలు, పలహార బండి ఊరేగింపులు కనుల పండువగా నిర్వహించేలా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లపై దృష్టి పెట్టారు.

23న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

ఏఐఎస్‌ఎఫ్‌ శేరిలింగంపల్లి అధ్యక్ష, కార్యదర్శులు నితీష్‌, ధర్మతేజ



బంద్‌ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్‌ఎఫ్‌ నేతలు

గచ్చిబౌలి: విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ ఈ నెల 23న నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్‌ శేరిలింగంపల్లి అధ్యక్షుడు నితీష్‌, కార్యదర్శి ధర్మతేజ కోరారు. ఏఐఎస్‌ఎఫ్‌ శేరిలింగంపల్లి మండల కౌన్సిల్‌ సమావేశాన్ని కొత్తగూడ జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించారు. బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉండే ఫీజు రీయింబర్స్‌మెంట్‌, ఉపకార వేతనాలను విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, శిథిలావస్థలో ప్రభుత్వ విద్యాలయాల స్థానంలో కొత్త భవనాలు నిర్మాణం చేయాలని డిమాండ్‌ చేశారు. ప్రైవేట్‌, కార్పొరేట్‌ విద్యాసంస్థలలో 25 శాతం ఫ్రీ ఎడ్యుకేషన్‌ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

శేరిలింగంపల్లిలో కార్పొరేటర్‌ రాగం పర్యటన



లింగంపల్లిలో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ నాగేందర్‌యాదవ్‌

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ స్థానికులతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్‌ మాట్లాడుతూ... వర్షాల కారణంగా ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. డ్రైనేజీ లైన్లు, సీసీ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. విద్యుత్‌ దీపాల ఏర్పాటుతో పాటు త్రీ ఫేస్‌ విద్యుత్‌ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాయకులు గడ్డం రవియాదవ్‌, కొయ్యాడ లక్ష్మణ్‌ యాదవ్‌, రాజుయాదవ్‌, యాదయ్య, రాజు, కృష్ణ, అజీమ్‌, సురేష్‌, ముబీన్‌, వినోద్‌, వినయ్‌ తదితరులు పాల్గొన్నారు.

వరద సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



శేరిలింగంపల్లిలో పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ప్రజలకు వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితిలోనే తప్ప ఇంటి నుంచి వర్షం పడే సమయంలో బయటకు రావద్దని సూచించారు. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా అధికారులు అన్ని చర్యలను తీసుకోవాలన్నారు. ఎక్కడా రాకపోకలకు ఇక్కట్లు పడకుండా చూడాలన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, మాన్‌సూన్‌ ఎమర్జెన్సీ టీమ్స్‌, డిజాస్టర్‌ మేనేజ్‌మెంట్‌ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉడాలని ఆయన స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీరు నాలా, మ్యాన్‌హోళ్ల ద్వారా తరలి వెళ్లేలా తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



సీతారామరాజు కాలనీలో వరద కాలువ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శ్రీకాంత్‌

మియాపూర్‌: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌ అధికారులకు సూచించారు. మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని అల్లూరి సీతారామరాజు నగర్‌ కాలనీలో చేపట్టిన వరదనీటి కాల్వ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ... కాలనీలో వరద సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కారించే నిమిత్తం వరదనీటి కాల్వ నిర్మాణ పనులను చేపట్టామన్నారు. పనుల్లో జాప్యం వహించకుండా పూర్తి చేయాలన్నారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డివిజన్‌ పరిధిలోని పలు లోతట్టు కాలనీలను పరిశీలించి ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ నేతలు రామకృష్ణ వర్మ, శ్రీనివాస్‌, సుధాకర్‌ రెడ్డి, నవీన్‌, శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.